

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

### రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

### చివరి విడత: మలి సందడి (48)

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## ఎక్స్‌టెన్షన్ ప్రహసనం

రాలెక్ ప్రఫుల్లకి తనే ఉత్తరం వ్రాశాడు. ఇప్పుడు నా దగ్గరికొచ్చి, 'ఎవరీ ప్రఫుల్ల?' అంటాడేమిటి?

ఉత్తరానికి బదులొచ్చిందా?

ఆయన చేతిలో ఓ కాగితముంది. అది ఆయన ఉత్తరానికి ప్రఫుల్లనుంచి వచ్చిన సమాధానమా?

ఆయన జర్మనీలో నా స్టే మరో ఆర్నెల్లు పొడిగించమని ప్రఫుల్లకి వ్రాశాడు. ప్రఫుల్ల ఒప్పుకుంటే, నేనిక్కడ ఇంకో ఆర్నెల్లుంటాను. లేదూ ఈ అక్టోబరు ఒకటికల్లా ఇండియా వెళ్ళిపోతాను.

ప్రఫుల్ల ఏం జవాబిచ్చినా అది నాకు సంబంధించినది. లాభమైనా, నష్టమైనా అది నాకు. అంటే సంతోషమైనా, కోపమైనా అది నాకు!

మరి ఆ సమాధానంలో ఏముందో కానీ, కోపం రాలెక్‌కి వచ్చింది. అదీ చాలా ఎక్కువగా–

ఎందుకు?

ఇలాంటి సమయంలో ఆలోచనకు ఎక్కువ పని చెప్పడం వృథా అనిపించి, “ప్రఫుల్ల అంటే మా డైరెక్టర్. నాకు బిగ్ బాస్” అని అంతవరకూ ఆ విషయం రాలెక్‌కి తెలియదన్నట్లుగా చెప్పాను.

రాలెక్ నా మాటలు విన్నట్లు లేదు. ఆయన ముఖం చూస్తే, నా సమాధానం వినాలని అనుకున్నట్లూ లేదు.

ఆయన ఏం మాట్లాడకపోతే, ఓ క్షణమాగి నేనే అన్నాను, “ఇండియానుంచి రిప్లై వచ్చిందా?”

ప్రఫుల్ల పేరెత్తడానికి ధైర్యం చాలక, 'ఇండియా' అన్నాను.

అప్పటికి రాలెక్ కొంచెం తమాయించుకున్నాడు, “ఆఁ వచ్చింది, చూస్తావా?” అన్నాడు.

“కాన్ఫిడెన్షియల్ కాకపోతే.....” అన్నాను తటపటాయిస్తూ.

రాలెక్ వెంటనే నాకా ఉత్తరం అందించి, “అరగంటాగి వస్తాను. ఈలోగా ఉత్తరం చదువు” అని వెళ్ళిపోయాడు.

ఆ ఉత్తరం చదవాలంటే భయమేసింది.

అది నా ఎక్స్‌టెన్షన్ గురించి రాలెక్ మా డైరెక్టరుకి వ్రాసిన ఉత్తరానికి జవాబు. ఆ జవాబులో ఏముంది?

మా డైరెక్టరు చెడ్డవాడేం కాదు. ఇండియాలో ఆయనకీ నా బాస్‌కీ అంతగా పడకపోవచ్చేమో కానీ, అక్కడ నాతో ఎప్పుడూ పరుషంగా మాట్లాడలేదు.

అదీకాక, అతిథిమర్యాదకు మా లేబరేటరీ పెట్టింది పేరు.

వచ్చింది రాజకీయనేతలైనా, ఇతరత్రా లబ్ధప్రతిష్ఠులైనా, శాస్త్రజ్ఞులైనా– సంతుష్టుల్ని చేసి పంపడం మా సంప్రదాయంలో భాగం. అది ప్రఫుల్ల మా లేబరేటరీకి రాక మునుపునుంచీ ఉంది. ఆయన వచ్చేకనూ కొనసాగుతోంది.

ఇక విదేశీయుల విషయానికొస్తే, మన భారతీయులందరికీ ఉండే బలహీనత ఆయనకూ ఉంది. అదే– అతిథి మర్యాద అతిగా చెయ్యడం!

అలాంటిది విదేశీయుడైన రాలెక్ తనకో ఉత్తరం వ్రాస్తే– వ్రాసినవాడు అంత ఆగ్రహావేశాలకు గురయ్యేలా ఏం బదులిచ్చాడు ప్రఫుల్ల?

ఊహకందే సమాధానం కాదది! అందుకని నెమ్మదిగా ధైర్యం కూడగట్టుకుని ఆ ఉత్తరం చదవడం మొదలెట్టాను.

చదువుతుంటే ముందు ఆశ్చర్యం, తర్వాత ఆనందం కలిగింది.

ఎందుకంటే– ఆ ఉత్తరంనిండా నాకు పొగడ్తలే!

అంతవరకూ ప్రఫుల్ల నాతో పరుషంగా మాట్లాడి ఉండకపోవచ్చుగానీ, ఇంతగా ఎప్పుడూ పొగడనూలేదు.

ఆ ఉత్తరంలో ఆయన నన్నూ, నా ప్రతిభనూ, నా అంకితభావాన్నీ, వ్యక్తిత్వాన్నీ తెగ పొగుడుతూ ముందో పేరా వ్రాశాడు.

తర్వాత పేరాలో మా లేబరేటరీలో కొత్తగా రిక్రూట్మెంట్సు ఔతున్నాయనీ, కొత్తగా చేరినవాళ్ళకి నావంటివారి సమక్షం స్ఫూర్తిదాయకంగా ఉంటుందనీ వ్రాశాడు.

నేను మా లేబరేటరీకి పెద్ద అసెట్ అట! అక్కడ నన్ను బాగా మిస్సవుతున్నారుట. ఎప్పుడు తిరిగొస్తానా అని నా రాకకోసం తాను ఎదురు చూస్తున్నాట్ట. ఈ కారణాలవల్ల– అనుకున్న గడువుకి మించి ఒక్క రోజు కూడా నేను లేకుండా అక్కడ గడవదని తర్వాత పేరా.

అంటే నాకు ఎక్స్‌టెన్షన్ రాదు. ఎక్స్‌టెన్షన్ ఇవ్వడం ఇష్టం లేకనే– ఆయన నన్నంతలా పొగిడి ఉండొచ్చు కూడా.

కానీ అప్పటికి నేనింకా బాగా జూనియర్ని. ప్రఫుల్ల అప్పటికి నాకంటే కనీసం ఐదు గ్రేడ్లు ఎక్కువలో ఉన్నాడు. అదికాక మొత్తం లేబరేటరీకి తనే అధినేత.

నాకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చినా, నేనిక్కడుండేది ఇంకో ఆర్నెల్లు. అంతే!

ఆ తర్వాత నా సర్వీసు అక్కడే కదా! లేబరేటరీలో– కనీసం రానున్న దశాబ్ద కాలంలో– నా భవిష్యత్తుకి బంగారు బాట పడడానికి ఇప్పుడు ప్రఫుల్ల వ్రాసిన ఈ ఉత్తరం చాలు. ఇందులోని వాక్యాల్ని కోట్ చేస్తూ, రాలెక్ నాకో టెస్టిమోనియల్ ఇస్తే– అదే సాక్ష్యమౌతుంది.

పోనీలే ఎక్స్‌టెన్షన్ ఇవ్వకపోతే ఇవ్వకపోయాడు– నా గురించి నాలుగు మంచిమాటలు చెప్పాడు అని సంతోషించాను

కానీ– ఇందులో రాలెక్‌కి కోపమొచ్చే విశేషమేముంది?

అప్పుడే నాకు స్ఫురించింది– నేనింకా ఉత్తరం పూర్తిగా చదవలేదని.

అనాసక్తంగానే మిగతా ఉత్తరం చదివితే–

తర్వాతి పేరాలో ప్రస్తుతం బెర్లిన్లో నేను పనిచేస్తున్న సంస్థని పొగిడాడు ప్రఫుల్ల. తను రాలెక్ పబ్లికేషన్సు చూశాననీ– ఆయన ఆధ్వర్యంలో నేను చేస్తున్న రీసెర్చివల్ల– మా లేబరేటరీకీ, ఇండియాకీ, ప్రపంచానికీ కూడా ఎంతో ప్రయోజనముందనీ వ్రాశాడు.

చివరి పేరాలో, "నువ్వంటే నాకు చాలా చాలా గౌరవం. నీ అంతటివాడి సిఫారసు కాదనడం మర్యాద కాదు. అందుకని ఆరు నెలలు కాకపోయినా, ఎలాగో అలా వీలు చేసుకుని, డాక్టర్ రావుకి మూడు నెలలు ఎక్స్‌టెన్షన్ ఇవ్వగలను" అని వ్రాశాడు.

ఆశ్చర్యపోయాను. అడిగినంత కాకపోయినా మా డైరెక్టరు నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ ఇచ్చాడు. ఇది నాకు గొప్ప విజయం.

ఆ ఉత్తరం నన్ను గొప్పవాణ్ణి చేసింది. నా వర్కుని గొప్ప చేసింది. రాలెక్‌నీ, బెర్లిన్లో ఈ సంస్థనీ గొప్ప చేసింది. నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ కూడా ఇచ్చింది.

ఇందులో కోపం తెచ్చుకోవాల్సిన అంశమేముంది?

నిజానికి మూణ్ణెల్ల ఎక్స్‌టెన్షనే నాకు ఎక్కువ వీలు. అప్పుడు నేను జనవరికల్లా ఇండియా వెడతాను. స్కూళ్లు జనవరి–జనవరి కాబట్టి పిల్లలకది అడ్మిషన్సు టైము. నేను, శ్రీమతి ఐతే– జనవరి దాటి ఇక్కడుండడానికి మొదట్నించీ ఇష్టపడ్డంలేదు.

కాగల కార్యం తీర్చిన గంధర్వుడయ్యాడు ప్రఫుల్ల.

ఈ విషయం రాలెక్‌కి చెప్పి, నా సంతోషాన్ని ప్రకటించాలని అనుకున్నాను కానీ– ఆయన కోపకారణం తెలుసుకోకుండా, ఈ విషయమై బయటపడకూడదనుకున్నాను.

రాలెక్ ఆంతర్యం తెలిసేదాకా, కాస్త డిప్లొమాటిక్‌గా వ్యవహరించాలనుకున్నాను.

రాలెక్‌కి టైమంటే టైమే. సరిగ్గా అరగంటలో వచ్చాడు. వస్తూనే, "ఉత్తరం చదివావా?" అనడిగాడు.

"ఊఁ మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ వచ్చింది" అన్నాను.

"ఔను. మనం ఆర్నెల్లడిగితే మూణ్ణెల్లు వచ్చింది" అన్నాడు రాలెక్ అదోలా.

"ఔను. అదైనా– ఉత్తరం వ్రాసింది నువ్వు కాబట్టి, నీమీద గౌరవంతో ఇచ్చినది…." అన్నాను.

"హుఁ గౌరవం" అదోలా నవ్వాడు రాలెక్. ఆ నవ్వులోనూ కోపమే ప్రతిఫలించింది.

నేనేదో అనబోయి ఆయనింకా ఏదో అనబోతున్నాడని గ్రహించి ఆగిపోయాను.

"నేను బాగా ఆలోచించి నీకు ఆర్నెల్లు ఎక్స్‌టెన్షన్ అవసరమని తేల్చాను. నేనన్నా, నా మాటన్నా గౌరవమున్నవాడు- అర్నెల్లూ ఇవ్వాలి...." అని ఇంకా ఏదో అనబోతుంటే-

"అసలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చే పరిస్థితే లేనప్పుడు, నీమీద గౌరవంతో మూణ్ణెల్లకు వీలు చేసుకున్నట్లు వ్రాశాడాయన"- ఉత్తరం సరిగ్గా చదివాడో లేదోనని మరోసారి వివరణ ఇచ్చాను.

"ఎక్స్‌టెన్షన్ ఇచ్చే పరిస్థితి లేకపోతే సారీ చెప్పేసి కాదనాలి. అప్పుడు నేనాయన పరిస్థితిని అర్థం చేసుకుని గౌరవిస్తాను. లేదూ ఆయనకి నామీద చెప్పలేనంత గౌరవముంటే- ఆ గౌరవంతో నేనడిగిన ఆర్నెల్లూ ఇవ్వడానికి వీలు చేసుకోవాలి. మధ్య ఈ మూణ్ణెల్లేమిటి? ఇదేమన్నా కూరగాయల బేరమా, లేక నామీద గౌరవం సగమే అనుకోవాలా?" అన్నాడు రాలెక్.

అప్పటికి నాకు రాలెక్ ఆంతర్యం అర్థమైంది.

గౌరవమంటే మాటల్లో కాదు, చేతల్లో కనబడాలి.

అడిగిందాంట్లో సగమే ఇచ్చి దాన్ని గౌరవం అనుకోవడం మన దేశంలో అనుసరించే సంప్రదాయం.

అందుకే ఏ ప్రాజెక్టుకైనా నిధులు కావాల్సొచ్చినప్పుడు, అవసరమైనదానికి కనీసం రెట్టింపు అడుగుతూ ప్రపోజల్సు ఇవ్వడం మాకు రివాజు.

అలా కాకుండా మేము ప్రపోజల్లో నిజాయితీగా మాకు కావాల్సిన మొత్తమే అడిగినా, అవతలివాళ్లు నమ్మరు. ఎక్కువే అడిగి ఉంటామని ఊహించేసుకుని, మేమడిగిందాంట్లో కనీసం సగమైనా తగ్గించి గ్రాంట్సు ఇవ్వడం, శాంక్షనింగ్ అథారిటీస్‌కి రివాజు.

ఈ రివాజు బ్రిటిషువారినుంచి మనకు సంక్రమించిందంటారు. ఐతే వారి దేశంలో ఇది అనుసరించరట. ఎందుకంటే అక్కడ ప్రభుత్వం పాలితులకి సేవిక. ఇక్కడ ప్రభుత్వం పాలితులకి యజమాని.

మనకు స్వతంత్రమొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్నాం. ఆ ప్రకారం ప్రభుత్వం పాలితులకి సేవిక. కానీ మనమలా అనుకోకుండా ప్రభుత్వాన్ని యజమాని గానే భావిస్తున్నాం.

పాశ్చాత్యులు మనకు చెప్పింది వాళ్లు చెయ్యరు. మనం మాత్రం వాళ్లు చెప్పిందే గుడ్డిగా అనుసరిస్తాం. ఉదాహరణకి-

ఎమ్మెస్సీ అయ్యేక పై చదువులకోసం విదేశ సంస్థలకి నేనెప్పుడూ దరఖాస్తులు పెట్టలేదు కానీ, నా కొలీగ్సు చాలామందే అలాంటి ప్రయత్నాలు చేశారు.

అప్పట్లో చదువుకి స్వంత డబ్బుతో విదేశాలు వెళ్లే స్తోమతు ఉన్నవారు అరుదు. దరఖాస్తు పెట్టినవారు ఆర్థిక సాయం కోరేవారు. అది లభిస్తేనే అక్కడికి వెళ్లేవారు.

ఆర్థిక సాయం కోరుతూ ఉత్తరం వ్రాసినప్పుడు పాశ్చాత్య సంస్థలు ఇచ్చే సమాధానాలు కొన్ని చూశాను.

వాటిలో మొదటి నాలుగైదు పేరాల్లో అభ్యర్థి గొప్పతనాన్ని ఆకాశానికెత్తేస్తాయి. ఎంతలా అంటే– ఇప్పుడు ప్రఫుల్ల రాలెక్‌కి వ్రాసిన ఉత్తరంలో నాకందిన పొగడ్తలు సూర్యుడిముందు దివిటీలా ఉంటాయి.

ఇంతా చేసి ఉత్తరం చివర్లో ఒకేఒక్క వాక్యంలో ఆర్థిక సాయం ఇవ్వలేకపోతునందుకు విచారం ఉంటుంది.

మొత్తం ఉత్తరం సారాంశం ఆ చివరి వాక్యమే!

అదే పాజిటివ్ ఉత్తరం ఐతే అందులో– ఆర్థికసాయం అందిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ఒకేఒక్క వాక్యం ఉంటుంది. మిగతా ఉత్తరమంతా–ఆర్థికసాయపు వివరాలు, నియమావళి ఉంటాయి.

రీసెర్చి రోజుల్లో మావాళ్లు అంటూండేవాళ్లు– 'ఉత్తరం పెద్దదైతే చివరి వాక్యం ఒక్కటే చదివి ఏడు. చిన్నదైతే నియమావళి చదువుకుని మురిసిపో' అని.

ఇప్పుడు ప్రఫుల్ల కొంత పాశ్చాత్య సంప్రదాయాన్నీ, కొంత భారత సంప్రదాయాన్నీ కలగలిపాడు. రాలెక్ తట్టుకోలేకపోయాడు.

ఈ విషయమై అంతకంటే లోతుగా ఆలోచించనవసరం లేదు. రాలెక్‌కి కోపమొస్తేనేం– నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ వచ్చింది. కొంత లోకజ్ఞానం కూడా పెరిగింది.

అదలాగుంచితే రాలెక్‌కి ప్రఫుల్లమీద కోపమొచ్చినా– నా వర్కుమీద బాగా ఆసక్తి ఉంది.

నేనక్కడ మరింత కాలం ఉండాలనుకున్నాడు. ఉండడానికి వీలు కాకపోతే, ఎలాగో అలా నా వర్కు పూర్తయ్యేలా చూడాలనుకున్నాడు.

అందుకే తనవద్ద ఎమ్మెస్ చేయడానికి చేరిన లూయిజీ అనే శిష్యుణ్ణి, నాకు అసిస్టెంటుగా అప్పజెప్పాడు.

లూయిజీ పూర్తి పేరు జోసెఫ్ లూయిజీ. అతడిది టునీషియా. ఆఫ్రికాలో ఉండే అరబ్ దేశం.

లూయిజీ గోధుమవర్ణంతో, చక్కని కనుముక్కు తీరుతో, చూడముచ్చటగా ఉంటాడు. భారీగా కాకుండా ఇంచుమించు నాకులాగే పల్చగానూ, ఉంటే నాకంటే ఓ గుప్పెడు పొడుగూ ఉంటాడు.

లూయిజీకి పెళ్లయింది. పిల్లలు లేరు. వాళ్ల జంట కూడా చూడముచ్చటగా ఉంటుంది. ఆమె కూడా అప్పుడప్పుడు లేబరేటరీకి వచ్చేది. ఆమె ఎక్కువగా జీన్సు వేసుకున్నా, సంప్రదాయపు అరబిక్ వనితలాగే కనిపించేది.

శ్రీమతి. పిల్లలు లేబరేటరీకి అప్పుడప్పుడు వస్తూండడంవల్ల– మా రెండు కుటుంబాలకూ కొంత పరిచయమైంది. ఐతే– కనబడినప్పుడు చిరునవ్వులకు మాత్రమే మా స్నేహం పరిమితం.

నేనూ, లూయిజీ మాత్రం కంబైండ్ రీసెర్చి కారణంగా బాగా సన్నిహితులమయ్యాం.

ఇండియన్సుకి భిన్నంగానూ, అక్కడి సంప్రదాయానికి అనుగుణంగానూ– లూయిజీ కూడా ముక్కుసూటి మనిషి.

అతడు ధారాళంగా జర్మన్ మాట్లాడతాడు. ఇంగ్లీషు కూడా వచ్చు. ఆ రోజుల్లో నాతో సహా చాలామందికి సుపరిచితం కాని కంప్యూటరు విషయంలో అతడికి కొంత శిక్షణ ఉంది.

లేబరేటరీలో కంప్యూటరుకోసం పెద్ద గది ఒకటి ఉంది. ఒకే ఒక్క కంప్యూటరు యంత్రం గదినిండా పరుచుకుని ఉండేది. దానికి ఒక ఆపరేటరు ఉండేవాడు.

కంప్యూటరు వాడాలంటే, ముందు మనం ప్రోగ్రాం వ్రాసుకుని తీసుకెళ్లి ఆపరేటరుకి ఇవ్వాలి. అతడికి వీలైన రోజున డేటాతో వెడితే, గంటలకి గంటలు (ఒకోసారి రోజులు కూడా) పట్టే ఈక్వేషన్సుకి గంట లోపులో సొల్యూషన్సు లభిస్తాయి.

కెటలిటిక్ ఈక్వేషన్సు క్లిష్టమైనవి. వాటి పరిష్కారానికి కంప్యూటరు పరిజ్ఞానం బాగా ఉపయోగపడుతుంది. లూయిజీ కంప్యూటరు గురించి మాట్లాడుతున్నప్పుడు, అప్రయత్నంగానే నా కళ్లలో ఆరాధనాభావం తొంగిచూసేది.

లూయిజీ నావద్ద చేరే నాటికే, మా కెటలిటిక్ రియాక్టరు సిద్ధమైంది. ఐతే అంతవరకూ అలాంటి రియాక్టర్ల గురించి చదవడమే తప్ప, పని చేసి ఉండకపోవడం వల్లనూ, జర్మన్–ఇంగ్లీషు గజిబిజి కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనక తప్పలేదు.

మనకి అన్నీ తెలిసినా ఒకోసారి తప్పటడుగు వేస్తాం.

ఉదాహరణకి చిన్నప్పుడు మా ఊళ్లో జరిగిన చిన్న దుర్ఘటన.

నేను చదివింది రాజమండ్రి గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో. ఉండేది ధవళేశ్వరంలో మా తాతగారింట్లో. అమ్మానాన్నలు అక్కడికి దగ్గర్లో కోనసీమలోని పేరవరం గ్రామంలో ఉండేవారు. సెలవుల్లో పేరరవరం వెళ్లి కొన్నాళ్లుండేవాణ్ణి.

అలా వెళ్లినప్పుడు ఒకసారి మా ఊరికో ఓ హరిదాసు వచ్చాడు.

మాది ఊరికి మధ్యలో ఉండే ఎత్తరుగుల ఇల్లు. హరికథకు అనువైన ప్రదేశం. అందుకని హరికథలకు, బుర్రకథలకు, నృత్యప్రదర్శనలకు– మా ఇల్లే వేదిక.

సాధారణంగా అరుగునానుకుని రోడ్డుమీద స్టేజి కట్టేవారు. ఒకోసారి అరుగుమీదే స్టేజి ఏర్పాటు చేసేవారు.

కార్యక్రమానికి కరెంటు మా ఇంట్లోంచే. అందుకు అనువుగా కొంత కరెంటు వైరు మా ఇంట్లోనే వదిలేసి ఉంచేవారు.

దురదృష్టం కొద్దీ ఆ రోజు కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మాన్ ఊళ్లో లేడు. హరిదాసు నా సాయం కోరాడు.

బీయస్సీలో నా మెయిన్ సబ్జక్ట్సు లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ. కాబట్టి నిస్సంకోచంగా ఒప్పుకున్నాను. కానీ కరెంటుతో వ్యవహారమని మా నాన్నగారు ససేమిరా అన్నారు. నాకు ఉక్రోషం వచ్చినా మనసులో దాచుకుని ఊరుకున్నాను.

హరిదాసు నీరసపడిపోయి, పెట్రోమాక్సు లైట్లకి కబురు పెట్టించాడు.

అప్పుడు ఊళ్లోనే ఎస్సెస్సెల్సీ చదువుతున్న భద్రం అనే కుర్రాడు ముందుకొచ్చాడు.

వైరింగులో మా ఊరి లైన్‌మాన్‌కి చాసార్లు సాయపడ్డాట్ట.

ఇటుపక్క ప్లగ్గునుంచి వైరులాగి అటుపక్క బల్బులు పెట్టడమే కదా, అదో పెద్ద పనే కాదు అన్నాడు.

నాకు నిజమే ననిపించింది.

ఇటు ప్లగ్గుపిన్‌నీ, అటు పెద్ద బల్బుహోల్డర్లు రెండింటినీ కలుపుతూ– సుమారు ఐదు మీటర్ల కరెంటు వైరు సిద్ధంగా ఉంది. నాన్నగారికి అదే చెబితే, "నువ్వు వైరు ముట్టుకోకు. వాణ్ణి పూర్తిగా నమ్మకు. సరిగ్గా కనెక్షనిస్తున్నాడో లేదో పైనుంచి సూపర్వయిజ్ చెయ్యి" అన్నారు.

ఆయన నామీద ఆమాత్రం నమ్మకముంచారని నేనూ, సమస్య తీరిందని హరిదాసూ సంతోషించాం.

భద్రం కనెక్షనిచ్చి చూస్తే, ఒకసారి రెండు బల్బులూ దివ్యంగా వెలిగాయి. ఐతే వైరు పొడవు ఓ రెండు మీటర్లు తక్కువైంది. "దాందేముందీ, వైరు మా ఇంట్లో ఉంది. అదీ ఇదీ కలుపుదాం" అంటూ భద్రం వాళ్లింటికెళ్లి అదనపు వైరు తెచ్చాడు. ఒకసారి దీపం వెలిగించిన ధైర్యంతో తను తెచ్చిన వైరుని ప్లగ్‌పిన్‌కి కనెక్ట్ చేశాడు.

అంతవరకూ బాగానే ఉంది. కానీ పాత వైరూ కొత్త వైరూ కలిసిన చోట రాగి వైరు ఎక్స్‌పోజ్ అయింది. అక్కడ బ్లాక్ టేప్ చుట్టి కవర్ చెయ్యాలి.

అదృష్టంకొద్దీ, హరిదాసు తన సరంజామాలో వెదికితే అలాంటి టేపు చిన్న ముక్క దొరికింది.

"ఇది చాలు. నేను సరిపెడతాగా" అన్నాడు భద్రం.

సరిగ్గా అప్పుడే అమ్మ నన్ను పిలిస్తే, లోపలికెళ్లాను. మరుక్షణంలో ఢాంమని చప్పుడు.

ఇంట్లో కరెంటు పోయింది.

ఏం జరిగిందంటే, బ్లాక్ టేపు ముక్క తక్కువుందని– పాజిటివ్, నెగెటివ్ తీగలకి విడివిడిగా కాక కలిపి చుట్టేసి కనెక్షనిచ్చాడు భద్రం.

అదేమంటే– నేనే అలా చెప్పానన్నాడు.

హరిదాసుకి పెట్రోమాక్సు లైటు తప్పలేదు.

మర్నాడుదయం లైన్‌మాన్ వచ్చి బయట ఎలక్ట్రిక్ స్తంభంమీద ఫ్యూజు వేసేదాకా మా ఇంట్లో కరెంటు లేదు.

నిజానిజాల విషయం ఎలాగున్నా– అది నాకు అవమానమే!

అలాంటిదే ఇప్పుడిక్కడ బెర్లిన్లోనూ జరిగింది.

అక్కడ భద్రం, ఇక్కడ అహమ్మద్.

అహమ్మద్ ఇంకా పిజి చేస్తున్నాడు. జర్మన్ భాషమీద మంచి పట్టుండడంవల్లనూ, నాతో మొదట్నించీ అందరికంటే ఎక్కువ చనువు, స్నేహభావంతో ఉండడంవల్లనూ– చాలా విషయాల్లో నేనతడి సాయం తీసుకునేవాణ్ణి.

ఇంకా పీజీ కాని తను ఓ పోస్ట్ డాక్టరల్ ఫెలోకి సాయపడుతున్నానని అతడికీ గర్వంగా ఉండేది.

మా రియాక్టరు సిద్ధమయ్యేక, దానికి డిజిటల్ టెంపరేచర్ ఇండికేటర్ కనెక్ట్ చెయ్యాల్సి ఉంది. కనెక్ట్ చేద్దామంటే దానిమీద చాలా సంకేత పదాలు జర్మన్ భాషలో ఉన్నాయి. అక్షరాలు ఇంగ్లీషువే కాబట్టి, అన్వయించుకోవడం అంత కష్టం కాదు కానీ నేనిలాంటి విషయాల్లో రిస్కు తీసుకోను.

అహమ్మద్‌ని సాయానికి పిలిచాను.

అహమ్మద్ కాలరెగరేసుకుంటూ వచ్చి, "ఇది చాలా సింపుల్ కనెక్షన్. ఐనా జాగ్రత్తగా స్టడీ చేస్తాను" అన్నాడు.

అతడు చాలాసేపు స్టడీ చేస్తాడు కాబోలనుకుని నేను టాయిలెట్‌కి వెళ్లాను.

నేను తిరిగొచ్చేసరికి, కేవలం ఐదు నిముషాలు. అంతే!

అప్పటికి అక్కడ అహమ్మద్‌తోపాటు రియాక్టర్ తయారు చేసిన ఇద్దరు వర్క్‌షాప్ ఇంజనీర్లూ ఉన్నారు.

జరిగిందేంటంటే– నేనిలా వెళ్లగానే అహమ్మద్ అలా కనెక్షన్ చేసేసి అలా వెడుతున్న ఇంజనీర్లని పిలిచాడు. రియాక్టరుకి ఇండికేటర్ తనే కనెక్ట్ చేశానని చెప్పుకోవాలని అతడి తపన. ఐతే అతడు మిల్లీవోల్ట్సు పాయింటుని మెయిన్సుకి కనెక్ట్ చేశాడు. అంటే బయట్నించి వచ్చే 220 వోల్ట్సు కరెంటు ఆ పాయింట్లోకి వెడుతుంది. కనెక్షనివ్వలేదు కానీ, ఇస్తే ఇండికేటర్ కాలిపోయుండేది.

వాళ్లా విషయం చెప్పగానే అహమ్మద్ ప్లేటు మార్చేశాడు. "కనెక్షన్ రావు చేశాడు. ఎలాగుందో చూడమని నన్ను పిలిచాడు. నాకు అనుమానమొచ్చి మిమ్మల్ని పిలిచాను. మంచిదే అయింది. లేకపోతే...." అంటూండగా నేనక్కడికొచ్చాను.

రియాక్టర్ డిజైనింగ్ సమయంలో నేనూ, ఆ ఇంజనీర్సూ ఎన్నో విషయాలు చర్చించి ఉన్నాం. నేనిస్తున్న వివరాలవల్ల తమ అవగాహన పెరిగిందని వాళ్లు నన్ను మెచ్చుకుంటే, వాళ్లడిగే వివరాలవల్ల నా పరిజ్ఞానం పెరిగిందని నేను వాళ్లకి బాకీ తీర్చుకున్నాను.

అందువల్ల వాళ్లకీ, నాకూ పరస్పరం సత్తాలు తెలుసు.

"రావ్! ఈ కనెక్షన్ నువ్విచ్చావంటే, నేను నమ్మను" అన్నాడు వాళ్లలో బెర్గర్.

విషయం అర్థమై, నేను అహమ్మద్ వంక చూశాను. అతడు నన్ను జాలిగా, అర్థింపుగా చూస్తున్నాడు.

ఏంచెయ్యాలో తెలియక, "పొరపాట్లు ఎవరికైనా వస్తాయి. పొరపాటుని అజ్ఞానం అనుకుంటే అది పొరపాటు" అన్నాను నర్మగర్భంగా.

“జీ హాబెన్ రెష్ట్ (యు ఆర్ రైట్)” అని నవ్వుకుంటూ వెళ్లిపోయారు వాళ్లిద్దరూ.

అప్పుడు నేను అహమ్మద్ వైపు తిరిగి, “నువ్వు పొరపాటు చేసి, నామీదకు తోసెయ్యడం బాగోలేదు” అన్నాను. కోపంగా కాదు, మందలిస్తున్నట్లు!

“నువ్వేమో డాక్టరేటువి. నీకు నీ దేశంలో ఉద్యోగముంది. మహా అయితే కొన్ని నెలలుంటావిక్కడ. నీగురించి కాస్త తప్పుగా అనుకున్నా నీకొచ్చిన నష్టమేం లేదు. నా సంగతి అలా కాదు. నా పీజీ పూర్తి కావాలి. ఆతర్వాత కూడా ఇంకా ఇక్కడే కొన్నేళ్లుండాలి. నామీద ఇంప్రెషన్ పోతే– మనుగడ కష్టమౌతుంది” అన్నాడు అహమ్మద్ జాలిగా.

“అలాంటప్పుడు ఇంప్రెస్ చెయ్యడానికి ఇలాంటి చెత్త ప్రయత్నాలు చెయ్యకూడదు. నాకు నష్టం లేకపోయినా పరువనేది ఉంటుందిగా, అది నాతోనే కాదు, నా దేశంతో కూడా ముడిపడింది మరి” అన్నాను.

“ఏమైతేనేం, పొరపాటుకి సారీ. మళ్లీ ఇలాంటివి జరుగనివ్వను. ఇప్పటికి రక్షించావు. అందుకు థాంక్స్” అన్నాడు అహమ్మద్.

“తెలిసింది నిర్భయంగా చెప్పాలి. తెలియంది నిస్సంకోచంగా ఒప్పుకోవాలి. అదీ మంచి సైంటిస్టు లక్షణం” అన్నాను.

“నువ్వు మంచి సైంటిస్టువని ఇక్కడ అందరికీ తెలుసు. ఆపైన– ఇక నీ కెటలిస్టుల టెస్టింగు మొదలౌతుందిగా– అవి జర్మన్ కెటలిస్టులకంటే గొప్పగా పని చెయ్యక పోతే చూడు...” అన్నాడు అహమ్మద్ అభిమానంగా.

“అహమ్మద్ హిందువు కాకపోవచ్చు. కానీ తథాస్తు దేవతలకి అలాంటి పట్టింపు ఉండదనికూడదు” అనుకుంటూ అతణ్ణి చూస్తే...

అప్పుడు అతడే తథాస్తు దేవతలా ఉన్నాడు.

అది నా భ్రమ కాదని అప్పుడు నాకు తెలియదు...

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments